నమస్తే తెలంగాణ
# ఖమ్మం
5 ఖమ్మం, బుధవారం 21 ఫిబ్రవరి 2024 KHAMMAM


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

## బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుందాం

### పార్లమెంట్ ఎన్నికలకు నేతలు, కార్యకర్తలు కార్యోన్ముఖులు కావాలి

### పార్టీ నాయకుల సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, ఫిబ్రవరి 20: రాష్ట్ర పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పనిచేద్దామని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుందామని రాష్ట్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ కార్యోన్ముఖులై పనిచేయాలని సూచించారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో ఖమ్మంలోని మమత ఆసుపత్రి ఆవరణలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కష్టకాలంలో ప్రతి ఒక్కరూ పార్టీకి అండగా నిలవాలని అన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పదవుల్లో ఉన్న పజాప్రతినిధులు ప్రజల మధ్యలో ఉంటూ కార్యకర్తలకు మద్దతుగా నిలబడాలని సూచించారు. బీఆర్ఎస్‌కు మంచి కాలం రాబోతోందని, ఎవరూ ఆందోళన చెందవద్దని అన్నారు. ఈ సమావేశంలో కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు ఆర్జేసీ కృష్ణ, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, వీరూనాయక్, మెంతుల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

### జడ్పీ సీఈవో వినోద్


అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో వినోద్

కూసుమంచి, ఫిబ్రవరి 20 : వేసవి కాలంలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, ఇందుకోసం ముందస్తు ప్రణాళికలు వేసుకోవాలని జడ్పీ సీఈవో వినోద్ సంబంధిత అధికారులకు సూచించారు. కూసుమంచి మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందిస్తూ వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాల్సిన బాధ్యత కింది స్థాయి అధికారులపై ఉందన్నారు. గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం నిర్వహణ ప్రక్రియ నిరంతరం కొనసాగాలన్నారు. గ్రామాల్లో చేపట్టిన వివిధ పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వేసవి వస్తున్నందున ఉపాధిహామీ పనులను కూలీలందరికీ కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీవో రామచందర్‌రావు, సూపరింటెండెంట్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## 23, 24న నిత్య కల్యాణం నిలిపివేత

భద్రాచలం, ఫిబ్రవరి 20 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 23, 24 తేదీల్లో సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తున్నందున స్వామివారికి రోజువారీగా నిర్వహించే నిత్య కల్యాణాలు నిలిపి వేయనున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 సాయంత్రం సహస్ర కలశాభిషేకానికి అంకురార్పణ, 23న సహస్ర కలశవాహనం, 24న సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. నిత్య కల్యాణం 22న ఉంటుందని, 23, 24న నిలిపివేసి.. మళ్లీ 25న యథావిధిగా నిత్య కల్యాణం పునఃప్రారంభమవుతుందని పేర్కొన్నారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

# పెద్దల సభకు రవిచంద్ర, రేణుకా చౌదరి

- ఇద్దరి ఎన్నిక ఏకగ్రీవం
- రాజ్యసభకు ఎన్నికైన ముగ్గురిలో ఇద్దరు ఖమ్మం జిల్లా నేతలే..
- బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల హర్షాతిరేకాలు


ధ్రువీకరణ పత్రంపై సంతకం చేస్తున్న వద్దిరాజు రవిచంద్ర, పక్కన ఎమ్మెల్సీ మధు

ఖమ్మం, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రం నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ సభ్యుల పదవుల్లో కాంగ్రెస్ పార్టీకి రెండు, బీఆర్ఎస్‌కు ఒక స్థానం ఖరారైన సంగతి తెలిసిందే. ఆయా పదవులకు మంగళవారం సాయంత్రంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. ప్రక్రియ తర్వాత బీఆర్ఎస్ తరఫున నామినేషన్ వేసిన వద్దిరాజు రవిచంద్ర, కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేసిన రేణుకా చౌదరి, అనిల్‌కుమార్ యాదవ్ నామినేషన్లు మాత్రమే మిగిలాయి. దీంతో వీరి ఎన్నిక ఏకగ్రీవంగా లాంఛనమైంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం వారి ఎన్నికను ధ్రువీకరించింది. తాజాగా పెద్దల సభకు వెళ్లే ముగ్గురిలో ఒక్క ఖమ్మం జిల్లా నుంచే ఇద్దరు ఉండడం విశేషం. ఇప్పటికే ఖమ్మం జిల్లా నుంచి రాజ్యసభ సభ్యులుగా వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, లోక్‌సభ సభ్యుడిగా నామా నాగేశ్వరరావు ప్రాతినిథ్యం వహిస్తుండగా, వీరిలో వద్దిరాజుకు తిరిగి రాజ్యసభ అభ్యర్థిగా అవకాశం వచ్చింది. కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా గారపాటి రేణుకా చౌదరికి ఆ పార్టీ అధిష్ఠానం అవకాశం కల్పించింది. దీంతో జిల్లా నుంచి ముగ్గురు రాజ్యసభ సభ్యులు పెద్దల సభలో తమ గొంతుక వినిపించే అవకాశం ఉందని, మున్ముందు జిల్లా ప్రజలకు మరింత మేలు జరుగుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### వద్దిరాజు ఎన్నికపై బీఆర్ఎస్ శ్రేణుల హర్షం..

బీఆర్ఎస్ అధిష్ఠానం రెండేళ్ల క్రితం వద్దిరాజుకు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించింది. వద్దిరాజు మొదటి నుంచీ పార్టీకి విధేయుడిగా పేరు తెచ్చుకున్నారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ప్రజల గొంతుకను వినిపించారు. గత శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకుని అభ్యర్థుల గెలుపునకు శాయశక్తులా కృషి చేశారు. ఫలితాలు ఏమైనప్పటికీ ఆయన కృషి మాత్రం ఎనలేనిది. ఆయనకు ఇప్పటికే వ్యాపారవేత్తగా జిల్లాలో పేరున్నది. అలాగే సౌమ్యుడిగా, పేదల పెన్నిధిగా పేరు తెచ్చుకున్నారు. రాజ్యసభ అభ్యర్థిగా వద్దిరాజును ప్రకటించడంపై గులాబీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. పార్టీ అధిష్ఠాన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాయి. రాజ్యసభ పరిధిలో ముగ్గురి స్థానాలు ఖాళీ అవుతుండగా వాటిలో రెండు స్థానాలు కాంగ్రెస్ పార్టీకి, ఒక స్థానం బీఆర్ఎస్‌కు దక్కాయి. దీనిలో భాగంగా బీఆర్ఎస్ తరఫున వద్దిరాజుకు అవకాశం లభించింది. వద్దిరాజుకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వద్దిరాజు ఎన్నికపై గులాబీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.


వద్దిరాజును అభినందిస్తున్న సండ్ర

### రేణుకాచౌదరి ఎంపికపై కాంగ్రెస్ శ్రేణుల హర్షం..

రేణుకా చౌదరి 1999 లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాజకీయాల్లో అరంగేట్రం చేసి గెలిచారు. తర్వాత 2004 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఖమ్మం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఖమ్మం నుంచి పోటీ చేసినప్పటికీ ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయం సాధించారు. తర్వాత కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం రేణుకా చౌదరికి రాజ్యసభ సభ్యురాలిగా అవకాశం కల్పించింది. నాటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ క్యాబినెట్‌లో ఆమె కేంద్ర మంత్రిగా పని చేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత 2014 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మిత్రపక్షంగా సీపీఐ ఉన్నది. దీంతో సీపీఐ నుంచి ఆ పార్టీ సీనియర్ నేత నారాయణ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో ఆ ఎన్నికలకు రేణుకా చౌదరి దూరంగా ఉన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఖమ్మం నుంచి రేణుకా చౌదరి పోటీచేసినప్పటికీ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుపై ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక నేతగా రేణుకాచౌదరికి పేరున్నది. ఆమె ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారనే ఊహాగానాలు వచ్చినప్పటికీ అది జరగలేదు. ఆమెకు కాంగ్రెస్ పార్టీ తరఫున ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలని ఉన్నప్పటికీ, ఏఐసీసీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ ఇక్కడి నుంచే పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. ఈ విషయమై రేణుకా చౌదరినే ఓ సందర్భంలో సోనియా గాంధీ ఖమ్మం నుంచి పోటీ చేయకపోతే తనదే సీటు అని మీడియా సమక్షంలో ప్రకటించారు. ఏదేమైనప్పటికీ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రస్తుతం ఆమెకు రాజ్యసభ సభ్యురాలిగా మరో అవకాశం కల్పిస్తున్నది. ఆమె ఎన్నికపై జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.


శిక్షణలో మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ కొండపల్లి శ్రీరామ్

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలి
- తహసీల్దార్లు, ఎస్‌వోల శిక్షణలో మాస్టర్ ట్రైనర్లు

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 20: రానున్న పార్లమెంట్ ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మాస్టర్ ట్రైనర్లు కె.శ్రీరామ్, మదన్‌గోపాల్ సూచించారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా 'ఎన్నికల విధులు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల నిర్వహణ' అనే అంశాలపై ఐడీవోసీలో మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ, అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. మాక్ పోలింగ్, పోలింగ్ సందర్భంలో సాంకేతిక సమస్యలు ఎదురైనప్పుడు చేపట్టాల్సిన చర్యలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు అసెంబ్లీ సెగ్మెంట్ల కేంద్రాల్లో ఉంటాయని, రిసెప్షన్ కేంద్రం కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు ఉంటుందని తెలిపారు. పోలైన ఈవీఎంల రవాణా ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా మాత్రమే చేపట్టాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కి ఒక కలర్ కోడ్‌తో రవాణా సిబ్బందికి టీ షర్టులు ఇవ్వనున్నట్లు చెప్పారు. నిర్ణీత సమయంలోగా నివేదికను సమర్పించాలన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన హ్యాండ్‌బుక్‌ను పూర్తిగా చదవాలని, ఏ సమయంలో ఏం చేయాలనే విషయాలను తూ.చ తప్పకుండా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి, వ్యవసాయ అధికారి విజయనిర్మల, తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

# జడ్పీ సమావేశం.. గరంగరం

- సమస్యలకు పరిష్కారం చూపని అధికారులపై ఆగ్రహం
- అధికారులను నిలదీసిన పలువురు సభ్యులు
- సమస్యలను పరిష్కరిస్తాం : కలెక్టర్ ప్రియాంక ఆల, జడ్పీ చైర్మన్ కంచర్ల
- సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కూనంనేని, తెల్లం, రాందాస్‌నాయక్


జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల. చిత్రంలో చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఎమ్మెల్యేలు తెల్లం, కూనంనేని, రాందాస్‌నాయక్

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : అపరిష్కృత సమస్యలను పరిష్కరించడంలో సంబంధిత శాఖల అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, తమ శాఖలపై ఉన్నతాధికారులకు అజమాయిషీ లేకపోవడంతో పరిస్థితి గందరగోళంగా మారిందని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులను నిలదీశారు. మంగళవారం కొత్తగూడెం జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి కలెక్టర్ ప్రియాంక ఆల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత చండ్రుగొండ జడ్పీటీసీ వెంకటరెడ్డి మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో తల్లీబిడ్డ చనిపోతే కనీసం వైద్యులపై చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్ల పనులను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేయడం దారుణమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు లేకపోవడంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్య అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆళ్లపల్లి పీహెచ్‌సీలో నర్సులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ మంజుభార్గవి సభ దృష్టికి తెచ్చారు. ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలలకు రాకపోగా.. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటూ పిల్లల చదువులకు ఆటంకం కలిగిస్తున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. పలు అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థకు చేరాయని, వాటికి మరమ్మతులు చేయించాలని కోరారు. కాగా.. పలు సమస్యలపై ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖల అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. సమావేశ మందిరం నిండిపోవడంతో కొందరు అధికారులు ఆరుబయటే కూర్చున్నారు.

### జిల్లా ఆస్పత్రిలో అపరిశుభ్రత :ఎమ్మెల్యే కూనంనేని

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అపరిశుభ్రత నెలకొన్నదని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఎంసీహెచ్‌లో తల్లీబిడ్డ చనిపోతే పై అధికారులకు కూడా తెలియకపోవడం బాధాకరమన్నారు. ఇక నుంచి అలా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జడ్పీ సీఈవో ప్రసూనరాణి, అన్ని శాఖల అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

### సమస్యలను పరిష్కరిస్తాం

#### కలెక్టర్ ప్రియాంక, చైర్మన్ కంచర్ల

అపరిష్కృత సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని కలెక్టర్ ప్రియాంక ఆల, చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. గత సమావేశంలో సభ్యులు సభ దృష్టికి చాలా సమస్యలు తెచ్చారని, గతంలో ఉన్న అధికారులు ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వెళ్లడంతో అవి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వారి స్థానంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులు సమస్యలకు పరిష్కారం చూపుతారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, నర్సుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేలు చాలా సమస్యలను మా దృష్టికి తెచ్చారని, వాటిని కూడా త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. గతంలో మంజూరై నిలిచిపోయిన పనులను కూడా ప్రభుత్వ అనుమతితో పూర్తి చేస్తామన్నారు.

## ఘనంగా రామయ్య నిత్యకల్యాణం


రామయ్యకు నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఫిబ్రవరి 20 : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దివ్య క్షేత్రంలో మంగళవారం సీతారాముల నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, తదితర నిత్య పూజలు భక్తి ప్రపత్తులతో జరిపారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపి, భక్తులకు ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

# ప్రయాణం.. ప్రమాదభరితం

- బోనకల్లు మండల కేంద్రం వద్ద ప్రాణసంకటంగా రహదారులు
- జంక్షన్‌లో రింగ్ నిర్మాణంలేక తికమకపడుతున్న వాహనదారులు
- కూడలి సూచికలు, వేగ నిరోధకాలులేక తరచూ ప్రమాదాలు
- ఆర్‌వోబీదీ అదే తీరు.. మెట్లు లేక పట్టాలు దాటుతున్న ప్రయాణికులు


రింగ్‌రోడ్డు నిర్మాణం లేకపోవడం వల్ల రోడ్డుపై ఇష్టారాజ్యంగా వెళ్తున్న వాహనదారులు

బోనకల్లు, ఫిబ్రవరి 20 : బోనకల్లు మండల కేంద్రంలో ప్రయాణం ప్రాణసంకటంగా మారుతోంది. ఇక్కడి రహదారులపై రాకపోకలు సాగించడం ప్రమాదభరితంగా ఉంటోంది. తరచూ ప్రమాదాలు జరుగుతుండడమే ఇందుకు కారణంగా కన్పిస్తోంది. మండల కేంద్రంలోని జంక్షన్‌లో రింగ్ నిర్మాణం లేకపోవంతో దూరప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు తికమకపడుతున్నారు. కొందరు వాహనదారులు అధిక వేగంతో వెళ్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వీటిల్లో ఎక్కువగా బాటసారులు గాయపడుతున్నారు. జంక్షన్ వద్ద రింగ్ నిర్మాణం లేకపోవడం, కూడలి సూచికలు, వేగ నిరోధకాలు నిర్మించకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఇక రైల్వే ఓవర్ బ్రిడ్జి తీరు కూడా అదేవిధంగా ఉంది. ఆర్‌వోబీకి మెట్లు లేకపోవడంతో ప్రయాణికులు ప్రమాదభరితంగా రైలు పట్టాలు దాటి వెళ్లాల్సి వస్తోంది.

తెలంగాణ – ఆంధ్రా రోడ్డు మార్గంలో బోనకల్లు రహదారి ప్రధానమైనది. బోనకల్లు మండల కేంద్రంలో 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రైల్వేగేటును తొలగించింది. రూ.26 కోట్లతో ఆర్‌వోబీ నిర్మించింది. దానికి ఇరువైపులా అప్రోచ్‌రోడ్లు కూడా ఏర్పాటు చేసింది. కానీ ఈ మార్గంలోని నాలుగు రహదారులను కలిసే జంక్షన్‌లో మాత్రం రింగ్ ఏర్పాటు చేయడాన్ని మరిచింది. ఇదే ఇప్పుడు అనేక ప్రమాదాలకు కారణమవుతోంది. ఈ రోడ్డు మార్గంలో బోనకల్లు నుంచి ఒకరోడ్డు, వైరా నుంచి బ్రిడ్జి మీదుగా మరొక రోడ్డు, ఖమ్మం నుంచి ఇంకొక రోడ్డు, జగ్గయ్యపేట నుంచి వేరొక రోడ్డు వచ్చి ఇక్కడ కలుస్తుంటాయి. 24 గంటలూ రద్దీగా ఉండే ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. నాలుగు కూడళ్లు కలిసే ఈ ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ అధికారులు రింగ్‌ను నిర్మించలేదు. దూరప్రాంతాల నుంచి కొత్తగా వచ్చే వాహనదారులు ఎటువైపున ఏ మార్గానికి మళ్లాలో తెలియక తికమకపడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్నిసార్లు కొన్ని వాహనాలు ఎదురెదురుగా వచ్చే క్రమంలో ఒకే మార్గంలోకి వెళ్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.


గమ్యం చేరుకునేందుకు రైల్వేట్రాక్ దాటుతున్న ప్రయాణికులు

### ఆదమరిస్తే ప్రమాదమే..


వైరా నుంచి జగ్గయ్యపేట వైపు వెళ్లే మార్గంలో వాహనాలు అతివేగంగా వస్తుంటాయి. ఆ సమయంలో బోనకల్లు నుంచి, ఖమ్మం నుంచి వచ్చే వాహనాలు ఆదమరిస్తే ప్రమాదాలు సంభవించినట్టే లెక్క. ఇంతటి ప్రమాదకరమైన ప్రదేశంలో కూడలి నిర్మించకపోవడంతో వాహనాల వేగాన్ని నిరోధించే అవకాశం లేకుండాపోతోంది. దీంతో వాహనాలు ఢీకొని బాటసారులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయి.


ఆర్వోబీకి మెట్లు నిర్మించాల్సిన ప్రదేశం ఇదే..

### ఆర్‌వోబీదీ అదే తీరు..


ఆర్‌వోబీ వద్ద కూడా ఇలాంటి పరిస్థితి ఉంది. గతంలో ఉన్న రైల్వేగేటును అప్పటి అధికారులు తొలగించి ఓవర్ బ్రిడ్జి నిర్మించడంతో ఇక్కడి ప్రజలు ఆనందపడ్డారు. సౌకర్యంగా ఉంటుందని సంబురపడ్డారు కానీ తరువాత వారికి నిరాశే మిగిలింది. రైల్వే ట్రాక్‌పై ఆర్‌వోబీ నిర్మించిన అధికారులు దానికి మెట్లు మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో ఆర్‌వోబీపై వాహనాలు సులభంగానే వెళ్తున్నా పాదచారులకు మాత్రం ప్రయాస తప్పడం లేదు. దీంతో వారు ప్రమాదమని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో రైలు పట్టాలు దాటి రాకపోకలు సాగిస్తున్నారు. ట్రాక్ దాటే క్రమంలో కొన్నిసార్లు అతివేగమైన రైళ్లు వస్తూపోతూ ఉంటాయి. ఇక్కడ వృద్ధులు పట్టాలు దాటాలంటే మరింత ప్రమాదకరంగా ఉంటోంది. అయితే ఈ ప్రాంతంలో ట్రాక్ దాటుతూ అనేకమంది మరణించిన ఘటనలు కూడా ఉన్నాయి.

## విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకుని ప్రజలకు సేవలు అందించాలి : ఖమ్మం సీపీ


మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 20: సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లుగా కొలువులు సాధించిన 158 మంది విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకోవాలని, అనంతరం ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సీపీ సునీల్‌దత్ ఆకాంక్షించారు. ఖమ్మం నగరంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మంగళవారం ఆయన కానిస్టేబుళ్లకు పోలీస్ ఐడెంటిఫికేషన్ కార్డుతో పాటు కిట్స్ అందించి మాట్లాడారు. హైదరాబాద్‌లోని తెలంగాణ పోలీస్ అకాడమీ, పీటీసీ వరంగల్, సీటీసీ సైబరాబాద్‌తో పాటు ఇతర సెంటర్లలో తొమ్మిది నెలల పాటు చక్కటి శిక్షణ ఉంటుందని, ఈ అవకాశాన్ని కానిస్టేబుళ్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హోం సిక్‌కు గురికావొద్దని, మానసికంగా బలంగా ఉండాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే తోటి వారితో పంచుకోవాలని, ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. క్రమశిక్షణను అలవరచుకోవాలని, వ్యాయామం చేస్తూ దేహ దారుఢ్యాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీఆర్బీ ఏసీపీ గణేష్, ఏవో అక్తరున్నీసా బేగం, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, అప్పలనాయుడు, సీఐలు అంజలి, స్వామి, వెంకన్న, సెక్షన్ సూపరింటెండెంట్ జానకీరాం పాల్గొన్నారు.

## సేవలో పోలీసుల పాత్ర కీలకం : భద్రాద్రి ఎస్పీ


ఎంపికైన అభ్యర్థులకు బ్రీఫింగ్ ఇస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 20 : ప్రత్యక్షంగా ప్రజలకు సేవలు అందించడంలో పోలీసుల పాత్ర చాలా కీలకమైందని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు అన్నారు. హేమచంద్రాపురంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా నుంచి ఉత్తీర్ణులైన 75 మంది అభ్యర్థులకు ఎస్పీ మంగళవారం బ్రీఫింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ కానిస్టేబుల్ విభాగంలో 27 మంది పురుషులను సైబరాబాద్ (సీటీసీ) ట్రైనింగ్ సెంటర్‌కు, 18 మంది మహిళలను వరంగల్ పీటీసీ, ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ కానిస్టేబుల్ విభాగంలో 22 మంది పురుషులను యూసుఫ్‌గూడలోని మొదటి బెటాలియన్‌కు, 8 మంది మహిళలను టీఎస్‌పీఏ ట్రైనింగ్ సెంటర్లకు తరలించినట్లు చెప్పారు. పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించాల్సిన ప్రతి ఒక్కరూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, అందుకోసమే క్రమశిక్షణతో కూడిన శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతుల్లో అందరూ మంచి ప్రావీణ్యాన్ని సాధించి విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకోవాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఏఆర్) విజయ్‌బాబు, అడ్మిన్ ఆర్ఐ బోలెం రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.